క్లుప్తంగా

పోటీ పరీక్షలకు ఫీజు రద్దు చేయాలి

వెల్దండ: అధికారంలోకి వస్తే పోటీ పరీక్షల ఫీజులను రద్దు చేస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీ మేరకు టెట్ పేపర్1కు రూ.1000, పేపర్ 2 కు రూ.1000 ఫీజులను రద్దు చేయాలని బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు జంగిలి యాదగిరి ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే టెట్ ఫీజులను ఉపసంహరించుకొని నిరుద్యోగులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు.

కోతులకు ఆహార పదార్థాలు వేయొద్దు

మన్ననూర్: కోతులకు తినుబండారాలు వేయొద్దని ఎఫ్ఆర్ఓ ఈశ్వర్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన రహదారి అటవీ సరిహద్దు ప్రాంతాల్లో కోతులకు తినుబండారు వేయడాన్ని పూర్తిగా నిషేధించామన్నారు. నిబంధనలకు వ్యతిరేకంగా ఎవరైన వ్యవహరిస్తే రూ.10 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. మన్ననూర్, ఫరహాబాద్, వటువర్లపల్లి, దోమలపెంట గ్రామాల సమీపంలో ఉన్న రోడ్లపై కోతులు అధికంగా సంచరిస్తాయని వాటికి వాహనదారులు తినుబండారాలు వేయొద్దని సూచించారు. ప్రకటనల బోర్డులు కూడా ఏర్పాటు చేశామని వాహనదారులు గమనించాలని కోరారు.

బీజేపీ అభ్యర్థిని గెలిపించాలి

కొల్లాపూర్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి భరత్‌ను గెలిపించాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సాయికృష్ణగౌడ్ కోరారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లతో ఒరిగేదేమీలేదన్నారు. ఆరు గ్యారంటీ అమలు ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సమావేశంలో నాయకులు కృష్ణ, వెంకటస్వామి తదితరులున్నారు.

విద్యార్థులకు టాలెంట్ టెస్టు



అచ్చంపేట రూరల్: పట్టణంలోని మిన్ జానిబ్ జామె మసీద్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఇస్లామిక్ టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించారు. 195 మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో జామె మసీద్ ఇమామ్ హఫీజ్ మహమ్మద్ గౌస్ అక్బర్, ఖాసీం, అజ్మత్, ఖాలిక్, మన్సూర్ ఖాన్, షరీన్, యూసుఫ్ గిలిమి పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



పెద్దకొత్తపల్లి: ముష్టిపల్లి గ్రామానికి చెందిన లింగస్వామి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యం కోసం బాధితుడు ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా రూ.36,500 లు మంజూరయ్యాయి. ఈ మేరకు కాంగ్రెస్ నాయకుడు చంద్రశేఖ ర్ బాధిత కుటుంబసభ్యులకు చెక్కు అందజేశారు. చెక్కు మంజూరు చేయించిన మంత్రి జూపల్లి కృష్ణారావుకు కృతజ్ఞతలు తెలిపారు.

తూడుకుర్తిలో వైద్య శిబిరం



నాగర్‌కర్నూల్ క్రైం: మండలంలోని తూడుకుర్తిలో ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. వైద్యులు లక్ష్మి, ఉదయ్‌కుమార్ వైద్య పరీక్షలు చేశారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా వైద్య మాట్లాడుతూ ప్రతి వారం గ్రామంలో ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో గైనకాలజిస్టు డా.శ్రావణి, శివుడు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక ప్రకటనపై హర్షం

తాడూరు: పేదలు ఇళ్లు నిర్మించుకోవడం కోసం ఉచిత ఇసుక ప్రకటనపై జెడ్పీటీసీ రోహిణి, ఎంపీటీసీ సంద రేణుకలు ఆదివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ప్రజాపాలనతో పాటు నిరంతరం పేదల అభివృద్ధికి కోసం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని వివరించారు. కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని పేర్కొన్నారు.

ముగిసిన మంత్రాలమ్మ ఉత్సవాలు



అలంకరణలో మంత్రాలమ్మ అమ్మవారు



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయ ప్రాంగణం

కొడేరు: మండలంలోని జనుంపల్లి శివారులో వెలిసిన గంగ మంత్రాలమ్మ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈ నెల 14 నుంచి ప్రారంభమైన ఉత్సవాలు ఆదివారం నెల పూజ కార్యక్రమంతో వైభవంగా ముగిసింది. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు చీర సారేతో సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మహిళలు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. జిల్లాలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. గాజుల దుకాణంలో మహిళలు, ఆట వస్తువులు దుకాణాల వద్ద చిన్నారుల సందడి కనిపించింది. వివిధ కార్యక్రమంలో పూజారి రాములు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రేపు సామూహిక వ్రతాలు..

నాగర్‌కర్నూల్‌రూరల్: పట్టణంలోని రామాలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు కందడై వరదరాజల్‌అయ్యంగర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సత్యసాయి సేవా సమితి సామూహిక భజన కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

వైభవంగా రంగనాయకస్వామి పల్లకీ సేవ



స్వామివారి పల్లకీసేవను నిర్వహిస్తున్న అర్చకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని శ్రీపురంలో కొలువుదీరిన రంగనాయకస్వామి వార్షిక అధ్యయన ఉత్సవాలు మూడు రోజులు పాటు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి. చివరి రోజు ఆదివారం స్వామివారి పరమపద ఉత్సవం, పల్లకిసేవ, ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త రంగాచార్యులు, మురళీధరాచార్యులు, అర్చకులు వినోదాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, వరదయ్య, చంద్రనారాయణ, మాధవన్‌రెడ్డి, గోపినాథ్, మల్లికార్జున్, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

పోటెత్తిన భక్తులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని నాయనోనిపల్లి మైసమ్మ దేవతను దర్శకునేందుకు ఆదివారం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కొత్తవాహనాలను ఆలయం చుట్టు తిప్పి పూజలు చేశారు. పొటేళ్లను బలిచ్చి బంధు, మిత్రులకు విందు ఏర్పాటు చేశారు. మొత్తం 10 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకునట్లు ఎండోమెంట్ అధికారి రంగారావు తెలిపారు.



మైసమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్న భక్తులు

చెక్‌పోస్టు వద్ద నిరంతర నిఘా



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

మన్ననూర్: లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని శ్రీశైలం–హైదరాబాద్ ప్రధాన జాతీయ రహదారిలోని చెక్‌పోస్టు వద్ద నిరంతరం నిఘా ఏర్పాటు చేసినట్లు అమ్రాబాద్ ఎస్ఐ రమేష్ అన్నారు. ప్రయాణికులు రూ.50 వేల నగదు కంటే ఎక్కువ తీసుకెళ్లొద్దన్నారు. ఎవరైనా తప్పని పరిస్థితిలో తీసుకెళ్తే నగదుకు సంబంధించిన పత్రాలు ఉండాలన్నారు. లేని పక్షంలో అధికారులు స్వాధీనం చేసుకుంటారని తెలిపారు. అదేవిధంగా డబ్బులు, మద్యం అక్రమ రవాణ చేస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు కూడా ఎన్నికల నిబంధనలకు కట్టుబడి ఉండాలని కోరారు. నలుగురు సీఆర్పీఎఫ్ పోలీసులు, ఇద్దరు హెడ్ కానిస్టేబుల్స్, నలుగురు సివిల్ పోలీసులతో పాటూ ఆయా సంబంధిత శాఖల అధికారులు 24 గంటల పాటు విధుల్లో ఉంటున్నారని వివరించారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న పూర్ణచంద్రరావు

లింగాల: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని 'నైస్ ఫౌండేషన్' వ్యవస్థాపకుడు పూర్ణచంద్రరావు అన్నారు. ఆదివారం మండలంలోని ఎర్రపెంటలో ఆ సంస్థ ఆధ్వర్యంలో 100 చెంచు కుటుంబాలకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెంచుల ఆరోగ్యం కోసం స్వచ్ఛంద సంస్థలు ముందుకువస్తున్నాయని వివరించారు. సంస్థ ఆధ్వర్యంలో 300 మంది చెంచులకు భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శ్రీధర్, ఆర్టీటీ ఏటీఎల్ రాధ, సిబ్బంది పాల్గొన్నారు.

జానపద కళాకారుల మండల కమిటీ ఎన్నిక

లింగాల: మండల కేంద్రంలోని కోదండరామాలయం ఆవరణలో ఆదివారం జానపద కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు పీకే గౌడ్ సమక్షంలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వాడల భీముడు, గౌరవాధ్యక్షుడిగా ఆవుల హన్మంతు, ఉపాధ్యక్షుడిగా మర్రిపల్లి బాలస్వామి, బుచ్చయ్య, గీత, ప్రధాన కార్యదర్శిగా ఎన్. హతిరాం, సహాయ కార్యదర్శులుగా ఆర్ రమేష్, శేషు, కోశాధికారిగా ఆకుల స్వామి, ప్రచార కార్యదర్శులుగా మర్రిపల్లి వెంకటేష్, పరశురాములు, చాకలి శ్రీను, తిర్పతయ్య, శివలక్ష్మి, సలహాదారులుగా ప్యారం లక్ష్మినర్సును ఎన్నుకున్నారు. ఈసందర్భంగా పీకేగౌడ్ మాట్లాడుతూ జానపద కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.



జానపద కళాకారుల సంఘం సభ్యులు

బల్మూర్: జానపద కళాకారుల సంఘం మండల అధ్యక్షుడిగా గోదల్ గ్రామానికి చెందిన మద్దెల అర్జున్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా లింగం, ప్రధాన కార్యదర్శిగా కృష్ణలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు జిల్లా కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

మల్లు రవికి పూర్తి మద్దతు



మల్లురవిని సన్మానిస్తున్న వెల్దండ మాజీ ఎంపీపీ జయప్రకాష్

మన్ననూర్: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మల్లు రవిని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిగా అధిష్టానం ప్రకటించడంపై మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి మద్దెల దివాకర్ ఆదివారం ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల్లో మల్లురవికి పూర్తిగా మద్దతు ఇస్తున్నామని పేర్కొన్నారు. అదేవిధంగా సీఎం రేవంత్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

వెల్దండ: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి మల్లురవిని భారీ మెజార్టీతో గెలిపించుకుందామని మాజీ ఎంపీపీ జయప్రకాష్ పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాదులో మల్లురవిని కలిసి శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ జయప్రకాష్ మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గంలో అన్ని పోలింగ్ బూత్‌ల వారిగా ప్రతి కార్యకర్త మల్లు రవి గెలుపుకోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాగేష్, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.

అచ్చంపేట రూరల్: మాజీ ఎంపీ డాక్టర్ మల్లురవిని ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో నల్లమల ప్రాంతానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ బిక్కుమల్ల మనోహర్, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు రాజేష్ కలిసి సన్మానించారు.

చిన్నారుల హోలీ సంబరాలు



లింగాలలో కేరింతలు కొడుతున్న చిన్నారులు

లింగాల: మండల కేంద్రంలో ఆదివారం చిన్నారులు హోలీ సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. రంగులు చల్లుకుంటూ జోదెరను ఆడుకుంటూ ఆనందంగా గడిపారు. రాత్రి దేవాలయం కమాన్ ఎదురుగా కాముడిని కాల్చి వేడుకలు చేసుకున్నారు. యువకులు, చిన్నారులు కేరింతలు కొట్టారు. అదేవిధంగా మండలంలోని ఆయా గ్రామాల్లో కామ దహనాన్ని నిర్వహించారు.

నేడు హోలీ..

కల్వకుర్తిరూరల్: హోలీ వేడుకలను సోమవారం నిర్వహించుకోవాలని విశ్వహిందూ పరిషత్, హనుమాన్ దేవస్థాన కమిటీలు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రసాయన రంగులను వాడొద్దని కోరారు. అదేవిధంగా పలు కాలనీలలో హోలీ వేడుకల కోసం ఆయా కాలనీవాసులు ప్రత్యేక ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండల ప్రజల హోలీ పండగను సహజ సిద్ధమైన రంగులను వినియోగించి ఉత్సవాలు నిర్వహించుకోవాలని ఎస్ఐ ప్రకటనలో కోరారు.

మద్యం స్వాధీనం

ఉప్పునుంతల: మండలంలోని దేవదారికుంట తండాకు చెందిన కిరాణం వ్యాపారి కాట్రావత్ పంతులు ఆదివారం మండల కేంద్రం నుంచి తండాకు అక్రమంగా మద్యం తరలిస్తున్నాడు. స్థానిక కేజీబీవీ పాఠశాల సమీపంలో పట్టుబడినట్లు ఎస్ఐ లెనిన్ తెలిపారు. అతని వద్ద నుంచి 12 బీరు బాటిళ్ల స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

లింగాల: మండలంలోని అంబట్‌పల్లిలో ఆదివారం పోలీసులు బెల్టు దుకాణాలపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. కందికొండ కోటి నుంచి 24 వివిధ రకాల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అచ్చంపేట మండలం నడింపల్లికి చెందిన వడ్డెర శ్రీశైలం గాయపడ్డాడు. ఎస్ఐ లెనిన్ వివరాల ప్రకారం వంగూరు మండలం చౌదర్‌పల్లి శివారులోని మైనింగ్ క్వారీ వద్ద పనులు ముగించుకొని బైక్‌పై అచ్చంపేట వైపు వడ్డెర శ్రీశైలం వస్తున్నాడు. ఎదురుగా కాంసానిపల్లితండాకు చెందిన కాట్రావత్ శివ బైక్ ఢీకొన్నది. ఈ ఘటనలో శ్రీశైలం తీవ్రంగా గాయపడి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి అల్లుడు సురేష్ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ముగిసిన క్రికెట్ టోర్నీ



షీల్డ్ అందజేస్తున్న మహేష్

దోమలపెంట: ఈగలపెంటలోని జెన్‌కో గ్రౌండ్‌లో పది రోజుల నుంచి కొనసాగుతున్న క్రికెట్ టోర్నీ ఆదివారంతో ముగిసింది. ఫైనల్స్‌లో జీసీ టీం, ఆర్‌కే చాంపియన్స్ పోటాపోటీగా తలపడ్డాయి. జీసీటీం విజేతగా నిలిచింది. ప్రథమ బహుమతి రూ.50 వేలు కటకం రాములమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కటకం మహేష్ అందజేశారు. రన్నర్‌గా నిలిచిన ఆర్‌కే చాంపియన్స్ జట్టుకు రూ.20వేలు ఇమ్రాన్ అందజేశారు. కార్యక్రమంలో భూగర్భ కేంద్రం సీఈ సూర్య నారాయణ, ఎస్ఈలు ఆదినారాయణ, రవీంద్రకుమార్, ఎంపీటీసీ మల్లికార్జున, తిమ్మన్న పాల్గొన్నారు.

అసంపూర్తిగా డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణం



వనపట్లలో అసంపూర్తిగా ఉన్న డబుల్‌బెడ్రూం ఇళ్లు

నాగర్‌కర్నూల్‌రూరల్: మండలంలోని వనపట్ల, గన్యాగుల, పెద్దముద్దనూర్ గ్రామాల్లో గత బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టింది. ఇప్పటికీ నాలుగేళ్లు గడిచినా పెద్దముద్దనూర్ గ్రామం మినహా వనపట్ల, గన్యాగుల గ్రామాల్లో ఇళ్ల నిర్మాణం పూర్తి కాలేదు. కొన్ని ఇళ్లు స్లాబ్ వరకు వేయగా మరికొన్ని ఇళ్లు పిల్లర్లు, బేస్‌మెంట్ వరకే పరిమితం అయ్యాయి. ఆయా గ్రామాల్లో ఇళ్లు లేని పేదలకు నిరాశే మిగిలింది. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పునాదులకే పరిమితం

తాడూరు: మండల కేంద్రంలో డబుల్‌బెడ్రూం ఇళ్లు పునాదులకే పరిమితం అయ్యాయి. ఆగస్టు 2021 సంవత్సరంలో అయ్యప్పస్వామి దేవాలయ ఆలయ ఆవరణ సమీపాన 104 డబుల్‌బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి రూ.524.16 లక్షల నిధులు కేటాయించారు. అప్పట్లో ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి భూమి పూజ నిర్వహించారు. నిధుల కొరత కారణంగా పునాదుల వరకే పనులు నిలిచిపోయాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పనులను వేగవంతం చేయాలని పలువురు కోరుతున్నారు.



తాడూరులో..

త్రైత సిద్ధాంత భగవద్గీతపై అవగాహన



గ్రంథాలను పంపిణీ చేస్తున్న త్రైత సిద్ధాం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక సభ్యులు

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలో త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఆ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం అవగాహన కల్పించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నాగర్‌కర్నూల్ కమిటీ అధ్యక్షుడు సాయిశంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఫాల్గుణ పూర్ణిమ రోజు హోలీ పండుగ నిర్వహించుకోవాలన్నారు. ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలన్నారు. అనంతరం పలువురికి గ్రంథాలను పంపిణీ చేశారు. మనోహర్, స్వప్న, పాల్గొన్నారు.

ఘనంగా మట్టల దినోత్సవం



మట్టల దినోత్సవాన్ని నిర్వహిస్తున్న క్రైస్తవులు

కల్వకుర్తి టౌన్: పట్టణంలో మట్టల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం ఎంబీ చర్చి నుంచి పట్టణ పురవీధుల గుండా క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాస్టర్ రాజు సందేశం ఇచ్చారు. చర్చి సంఘ వైస్ చైర్మన్ స్టీఫన్ సన్ విందును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు పాస్టర్ అమ్మ, సాయి ప్రసాద్, జ్యోతి, సురేష్‌బాబు, ఇజ్రాయిల్, పద్మ, వైడూర్య, జగదీష్, నంద, జాయ్‌లు పాల్గొన్నారు.

అధ్వానంగా బీటీ రోడ్డు



దేవినేనిపల్లి బీటీరోడ్డు ఇలా..

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవినేనిపల్లి బీటీరోడ్డు గుంతలమయంగా మారింది. ప్రధానమంత్రి సడక్‌యోజన పథకం కింద 2012 సంవత్సరంలో ఈ బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ప్రస్తుతం రోడ్డు కంకర తేలి అధ్వానంగా తయారైంది. దీంతో పెద్దకొత్తపల్లి నుంచి దేవినేనిపల్లి, అంబటిపల్లి మీదుగా శ్రీశైలం వెళ్లే వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. అదేవిధంగా మండలంలోని మైసమ్మ దేవత నుంచి యాపట్ల మీదుగా లింగాల వెళ్లే బీటీ రోడ్డు కంకర తేలి అధ్వానంగా తయారైంది. కాంట్రాక్టర్ పెద్దకొత్తపల్లి నుంచి మైసమ్మ దేవత వరకు మాత్రమే రోడ్డు నిర్మించారు. యాపట్ల మీదుగా రోడ్డు నిర్మాణపనులు చేపట్టలేదు. దీంతో పాత బీటీ రోడ్డు మొత్తం కొట్టుకుపోయి కంకర తేలింది. వాహనదారులు ఈ దారి గుండా వెళ్లేందుకు జంకుతున్నారు. రోడ్డు గుంతలమయంగా ఉండటంతో వృద్ధులు, చిన్నారులు నరకయాతన అనుభవిస్తున్నారు. ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకొని రోడ్డు పనులు పూర్తి చేయాలని చినకొత్తపల్లి, జగన్నాథ్‌పురం, యాపట్ల, అంబడిపల్లి గ్రామస్తులు కోరుతున్నారు.



కోతకు గురైన యాపట్ల బీటీ రోడ్డు

రాలుతున్న మామిడి కాయలు



వీపనగండ్ల: అధిక ఉష్ణోగ్రతలతో మామిడితోటల్లో వచ్చిన కొద్దిపాటి మామిడి కాయల దిగుబడి రాలుతుండడంతో మామిడి రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ యాసంగిలో దాదాపు 80 శాతం తోటలు దిగుబడికి నోచుకోలేదు. కొద్దిపాటి మామిడికాయలకు మద్దతు ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని మామిడి తోటల రైతులు కోరుతున్నారు. సమీప పట్టణమైన కొల్లాపూర్‌లో మామిడి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.